క్లుప్తంగా

సాగర మాత దేవాలయంలో భక్తుల సందడి



విజయపురి సౌత్: సాగర మాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. ఉదయం కృష్ణా నదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలి పూజలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. జపమాల క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు.

కనకదుర్గకు నిమ్మకాయలతో అలంకారం



పిడుగురాళ్ల: శ్రావణ మాసం మూడో ఆదివారం సందర్భంగా పట్టణంలోని భవానీ నగర్‌లో ఉన్న కనకదుర్గ అమ్మవారిని నిమ్మకాయలతో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

సందడిగా రక్షా బంధన్ వేడుకలు



చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): మండలంలోని చాగంటివారిపాలెంలో గల శ్రీ గన్నాథస్వామి దేవాలయంలో ఆదివారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్తెనపల్లికి చెందిన ఆర్ఎస్ఎస్ సభ్యులు, విశ్రాంత ఉపాధ్యాయుడు శాస్త్రి, న్యాయవాదులు సత్యనారాయణ, నలమోతు వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఏ.ఎస్.కె.వి.రంగారెడ్డి పాల్గొన్నారు. రక్షాబంధన్ ప్రాముఖ్యతను చిన్నారులకు వివరించారు. నేను నీకు రక్ష.. నీవు నాకు రక్ష.. మనమిద్దరం దేశానికి, ధర్మానికి రక్ష అనే నినాదాన్ని వారితో పలికించారు. అనంతరం ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకున్నారు. కార్యక్రమంలో గాయత్రి పరివార్ సభ్యులు, బాల వికాస చిన్నారులు పాల్గొన్నారు.

నేడు కొత్తపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

మాచవరం: మండలంలోని కొత్తపాలెంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి పాల్గొంటారన్నారు. నాలుగున్నర ఏళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్ని ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఇందేం 'శునక' వాదన..!

- మాచవరం ఎంపీడీవో శునకానికి సుస్తి
- బాపట్ల ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లిన అధికారి
- పశువుల వైద్యశాలకు వెళ్లాలని సూచించిన సిబ్బంది
- పేషెంట్ బెడ్‌పై పడుకోబెట్టి వైద్యం చేయాల్సిందేనని వాదన
- నచ్చచెప్పిన అవుట్ పోస్టు పోలీసులు

బాపట్ల టౌన్: పెంపుడు కుక్కకు ఆరోగ్యం సరిగా లేదు...తక్షణమే వైద్యసేవలు అందించాలంటూ పల్నాడు జిల్లా మాచవరం ఎంపీడీవో వరప్రసాదరావు ఆదివారం బాపట్ల ఏరియా వైద్యశాలలో హల్‌చల్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని క్రిస్టియన్ పేటకు చెందిన వరప్రసాదరావు మాచవరంలో ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తుంటారు. ఆదివారం పెంపుడు కుక్కను ఏరియా వైద్యశాలలోని అత్యవసర విభాగంలోకి తీసుకెళ్లారు. బెడ్‌మీద పడుకోపెట్టి తక్షణమే వైద్యసేవలు అందించాలని సిబ్బందిని కోరారు. ఇది ఏరియా వైద్యశాల...ఇక్కడ మనుషులకు మాత్రమే వైద్య సేవలు అందిస్తామని వారు తెలిపారు. పట్టణంలోని పశువుల వైద్యశాలకు వెళ్లాలని సిబ్బంది చెప్పినప్పటికీ సదరు ఎంపీడీవో వినిపించుకోలేదు. వెంటనే వైద్యశాల అవుట్‌పోస్ట్ పోలీసులు జోక్యం చేసుకొని సర్దిచెప్పి, అక్కడి నుంచి ఎంపీడీవోను పంపించి వేశారు.

అభివృద్ధే అజెండాగా ముందడుగు

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు
- గత పాలన, నేటి పాలనకు తేడా చూపించి ప్రజలవద్దకు వెళ్దాం
- ప్రతి కార్యకర్తా కష్టాల్లో పాలు పంచుకుంటాం
- ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తాం
- ప్రతి బూత్‌ని నియోజకవర్గ, మండల నాయకులు దత్తత తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి. వేదికపై ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు, నేతలు



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి చూపించి ముందుకు వెళ్దాం.. గత పాలనకు నేటి పాలనకు తేడా చూపించి ప్రజల వద్దకు వెళ్దామని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, నర్సరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీ కృష్ణదేవరాయలు తెలిపారు. పట్టణంలోని భవనాశి యల్లారావు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సచివాలయ కన్వీనర్ల సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీ కృష్ణదేవరాయలు మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గెలుపునకు ప్రతి కార్యకర్తా కృషి చేయాలని తెలిపారు. ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీగా తాను అండగా ఉంటామని చెప్పారు. పల్నాడు జిల్లాల్లో ఉన్న ప్రతి మండలం నుంచి అరగంటలో ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్లేలా జాతీయ రహదారుల్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. సచివాలయ కన్వీనర్లకు రూ. 10 లక్షలు బీమా వర్తించేలా పార్టీ నిర్ణయం తీసుకుందని ఆయన తెలియజేశారు. గతంలో జన్మభూమి కమిటీలు చేసిన అరాచకాలు ప్రజలు ఇంకా మరిచిపోలేదని చెప్పారు. ఇప్పుడు వలంటీర్ల సేవల్ని ప్రజలు మరిచిపోరని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నికలకు ఆరు హామీలతో ముందుకు వెళ్లామని, అందులో ఐదింటిని పూర్తి చేశామని వెల్లడించారు.

ఇక మిగిలిన తంగెడ, మాచవరం లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి నిధులు తీసుకు రావడం సమస్య కాదని చెప్పారు. కృష్ణా ట్రిబ్యునల్ నుంచి సమస్య ఉందని, దాన్ని కూడా పరిష్కరించి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్తి చేసేలా ముందుకు వెళ్దామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలకు ఇవ్వబోయే హామీల్లో భాగంగా జంగమహేశ్వరపురంలో అగ్రికల్చర్ కాలేజీ, పిడుగురాళ్లల్లో డిగ్రీ కాలేజీ, దాచేపల్లి పిడుగురాళ్ల మధ్యలో ఇంజినీరింగ్ కళాశాలల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. తాను గురజాల రూపురేఖలు మార్చేదాక ఎక్కడికీ పోనని ఎమ్మెల్యే కాసు స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి మంచి నీటిని తీసుకు రావాలని చూస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా పిడుగురాళ్ల పట్టణానికి రూ. 120 కోట్లు, దాచేపల్లి పట్టణానికి రూ. 14 కోట్లు, గురజాల పట్టణానికి రూ. 8 కోట్లు, 57 గ్రామాలకు కలిపి రూ. 72 కోట్లతో పనులు చేపడుతున్నామని వెల్లడించారు. ఇప్పటికే పిడుగురాళ్ల పట్టణం కొన్ని వార్డులు, దాచేపల్లిల్లో శ్రీనగర్, పొందుగుల, మాచవరం మండలంలోని తురకపాలెం, చెన్నాయపాలెం, పిన్నెల్లి వంటి గ్రామాల్లో పనులు పూర్తి మంచినీరు కూడా అందిస్తున్నామని వివరించారు. మిగిలిన గ్రామాలకు కూడా త్వరలోనే అందజేస్తామని తెలియజేశారు. గురజాల నియోజకవర్గంలో 22 వేల ఇళ్ల పట్టాల్ని ఇచ్చామని, ప్రతి మూడు ఇళ్లకు ఒక పట్టా ఇచ్చి ఒక కాలనీనే ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. గతంలో టీడీపీ నాయకులు ఒక్క కాలనీ కూడా కట్టించలేదని, కావాలంటే వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మించిన 60 కాలనీల గురించి చర్చకు సిద్ధమేనని ఆయన సవాల్ విసిరారు. పిడుగురాళ్ల పట్టణంలో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ నిర్మాణం జరుగుతోందని, త్వరలోనే వాటిని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. పిడుగురాళ్ల పట్టణంలోని మూడు, దాచేపల్లిల్లో రెండు, గురజాల్లో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్ని నిర్మించినట్లు చెప్పారు. ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా చూస్తామని, వారి కష్టాల్లో పాలు పంచుకుంటామని ఎమ్మెల్యే తెలియజేశారు. రెండు మూడు నెలల్లో ప్రతి ఒక్కరు గడప గడపకు వెళ్లాలని, ప్రతి నాయకుడిని కలుపుకుంటూ ముందుకు సాగుదామని ఆయన సూచించారు. ప్రతి బూత్‌ని మండల, నియోజకవర్గ నాయకులు ఒకరు దత్తత తీసుకోవాలని చెప్పారు. అక్కడ నాయకుల్ని కలుపుకొని ఆ బూత్‌లో విజయం సాధించేలా ముందుకు నడవాలని ఆయన దిశానిర్దేశం చేశారు. తాను కూడా బూత్‌ను దత్తత తీసుకొని ముందుకు వెళతానని తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, కౌన్సి లర్లు, కో– ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగ ఫలితమే స్వాతంత్య్రం



జ్యోతిరావ్ పూలే విగ్రహానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: మహనీయుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లా వద్ద జ్యోతిరావు పూలే విగ్రహం, పిల్లుట్ల రోడ్డులో చాకలి ఐలమ్మ, అంబేడ్కర్ విగ్రహం వద్ద బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైపాస్ రోడ్డు విస్తరణ పూర్తవ్వడంతో అన్ని నాయకుల విగ్రహాల్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పట్టణ, మండల కన్వీనర్లు చింతా వెంకట రామారావు, చల్లా పిచ్చిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దిన్, మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, బీసీ సెల్ కన్వీనర్ కందులూరి శివయ్య, ఎస్సీ సెల్ కన్వీనర్ కాలే మాణిక్యరావు, పట్టణ యూత్ కన్వీనర్ మందా సుధీర్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కుందుర్తి గురవాచారి, చల్లగుండ్ల సంతోషరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరభద్రుని రామిరెడ్డి, కో– ఆప్షన్ సభ్యులు శెట్టుపల్లి పూర్ణ, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్చిలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చి ప్రాంగణంలో రూ.10లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాలు, మరో రూ.10లక్షలతో నిర్మించనున్న అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే కాసు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరికేపల్లి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఇప్పటికే రూ.50లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. ఇరికేపల్లి బోడు నుంచి గ్రామం వరకు ఉన్న రోడ్డును విస్తరణ చేసేందుకు నిధులు కేటాయించామని, త్వరలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కాసును శాలువా, పూలదండలతో పెద్దలు నాగెండ్ల రత్నం, నాగెండ్ల ఏసయ్య, మాతంగి రాంబాబు, జాలె అశోక్ తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, మాజీ సర్పంచులు బుర్రి విజయ్‌కుమార్ రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, వైస్ చైర్మన్ కొమెర బత్తిన విజయ్‌కుమార్, కౌన్సిలర్లు మందపాటి వీరారెడ్డి, ఈదా వెంకటరెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభాని, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్, నాయకులు మందపాటి కృష్ణారెడ్డి, నాగెండ్ల పురుషోత్తం, పప్పుల ఆంజనేయులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

టీడీపీ వీరాభిమానికి పింఛన్



కొండకు పింఛన్ అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కారెంపూడి: పార్టీ పుట్టిన దగ్గర నుంచి టీడీపీకి వీరాభిమానిగా ఉన్న కారెంపూడికి చెందిన కొండకు ప్రభుత్వం మంజూరు చేసిన వృద్ధాప్య పింఛన్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు అందించారు. గ్రామ మాజీ సర్పంచ్ కంపా నాగరాజు, ఆశం విజయభాస్కరరెడ్డి, పలిశెట్టి ఆంజనేయులు ఆదివారం కొండకు నగదు అందజేశారు. తాను టీడీపీ అభిమానినని అందరికీ తెలుసని, కానీ అవేవి చూడకుండా పేదరికంలో ఉన్న తనకు పార్టీకలతీతంగా ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ మంజూరు చేసినందుకు కొండ ధన్యవాదాలు తెలిపారు.

ఆస్పత్రిలో పింఛన్ పంపిణీ



బాణావత్ శివాల నాయక్‌కు నగదు అందజేస్తున్న వలంటీర్

పిడుగురాళ్ల: పట్టణంలోని 6వ వార్డుకు చెందిన బాణావత్ శివాల నాయక్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ వద్ద జరిగిన ప్రమాదంలో కాలు పోయింది. గుంటూరులోని ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ శివ శ్రమకోర్చి అక్కడకు వెళ్లి శివాల నాయక్‌కు పింఛన్ అందజేశాడు.

వైభవంగా గ్రామ దేవతల జాతరలు



మొక్కుబడులు చెల్లిస్తున్న భక్తులు

గురజాల: మండలంలోని పల్లెగుంతలో ఆదివారం పోలేరమ్మ తిరునాళ్లను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దఎత్తునదర్శించుకున్నారు. మొక్కుబడులు ఉన్న వారు పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ పర్యవేక్షించింది.

కన్నుల పండువగా శిడిమాను ఉత్సవం

శిడిమాను ఉత్సవాన్ని సాయంత్రం వైభవోపేతంగా నిర్వహించారు. శిడిమానుకు కొబ్బరికాయలు కొట్టి ఉత్సవాన్ని గ్రామ పెద్దలు ప్రారంభించారు. రైతులు పండించిన పంటలు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం శిడిమానును గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. వర్షాలు సమృద్ధిగా పడాలని, రైతులు ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఏటా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ.

మండల పరిధిలోని చల్లగుడిపాడులో గంగమ్మ తల్లికి ఆదివారం బోనాల్ని సమర్పించారు. వేకువజాము నుంచి భక్తులు గంగమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు కుంకుమ బండ్లు కట్టి, అమ్మవారి దర్శనానికి తరలించారు. ఏర్పాట్లను యాదవ సంఘం పర్యవేక్షించింది.

దాచేపల్లిలో..

విస్తారంగా వర్షాలు కురిసి, పంటలు పండాలని కోరుతూ ఆదివారం దాచేపల్లిలోని శ్రీ వీర్ల అంకమ్మ తల్లికి మహిళలు బోనాలు సమర్పించారు. మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగించిన తరువాత ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించి, పూజలు చేశారు. మండలంలోని శ్రీనగర్, తక్కెళ్లపాడు గ్రామాల్లోనూ బోనాల్ని సమర్పించారు. కార్యక్రమాల్లో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, సర్పంచ్ కూసం నాగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఆకూరి కాశీరెడ్డి, జంగిలి నరసింహారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుడూరి గోవర్ధన్ రావు, జక్కా అనంతరామయ్య పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి బోనాలు

దుర్గి: మండలంలోని కంచరగుంటలో ఆదివారం పోలేరమ్మ తల్లికి బోనాల్ని సమర్పించారు. పెద్దసంఖ్యలో మహిళలు ఆనందోత్సాహాలు, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారికి బోనాలు సమర్పించి, పూజలు నిర్వహించారు. రైతులు బాగుండాలని, సకాలంలో పంటలు పండాలని కోరుకున్నారు. బండ్లు కట్టి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆకట్టుకుంది. ఏర్పాట్లను ఆలయ కమిటీ పర్యవేక్షించింది. కార్యక్రమంలో గ్రామస్తులు మాదాసు శ్రీనివాసరావు, అరిగెల కొండలు, మాదాసు పెద సాంబయ్య, దేశం నాగిరెడ్డి, రాళ్లపల్లి వీరనారాయణ, మాదాసు వెంకటేశ్వర్లు, కల్లూరు రాజేష్, మాదాసు ముక్కంటి, శ్రీపతి హనుమయ్య పాల్గొన్నారు.

ముత్యాలమ్మ, కాళికా మాతకు బోనాలు

మాచవరం: మండలంలోని పిన్నెల్లిలో ఆదివారం ముత్యాలమ్మ తల్లి, కాళికా మాతలకు భక్తులు బోనాలు సమర్పించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో తలపై బోనాలు పెట్టుకొని, మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా దేవాలయాలకు తరలి వెళ్లారు. అనంతరం అమ్మవార్లకు సమర్పించి, పూజలు నిర్వహించారు. ముత్యాలమ్మ తల్లికి పలువురు కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. కాళికా మాత ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

తీరిన కంచరగుంట గ్రామస్తుల దాహార్తి



బోరును ప్రారంభిస్తున్న ఎంపీపీ ఏసూరి సాయిశంకర్ తదితరులు

దుర్గి: మండలంలోని కంచరగుంట గ్రామస్తుల దాహార్తి తీరింది. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరును ఆదివారం ఎంపీపీ ఏసూరి సాయిశంకర్ ప్రారంభించారు. గ్రామస్తులు కొన్ని నెలలుగా మంచినీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. సమస్యను ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని ఎంపీపీకి సూచించారు. ఆయన నూతన బోరును వేయించారు. గ్రామస్తులు ప్రభుత్వ విప్ పీఆర్కేకు, ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బొంత కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు మాదాసు వెంకటేశ్వర్లు, దేవరకొండ పున్నారావు, సీతారామయ్య, మాదాసు వాసు, సర్పంచ్ బొమ్ము నాసరయ్య, కోట రాజు, శ్రీరామమూర్తి, నాసరయ్య, హనుమ య్య, కేతంశెట్టి పెద అంజయ్య, ఆలేటి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ సౌల్, రత్నరాజు, రాళ్లపల్లి కొండలు, మాదాసు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి కొనసాగుతున్న వలసలు



కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులకు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మండల పరిధిలోని నెహ్రూనగర్ తండా గ్రామానికి చెందిన 25 గిరిజన కుటుంబాలు ఆదివారం ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరాయి. ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం జగన్ గిరిజనులకు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు చెప్పారు. సాగు చేసుకుంటున్న భూముల్ని అమ్ముకునేందుకు అవకాశాన్ని కల్పించారని తెలిపారు. వైఎస్సార్ జలకళతో ఉచితంగా బోర్లు వేయించారని పేర్కొన్నారు. టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరిన వారికి తగిన గౌరవాన్ని కల్పిస్తానని హామీనిచ్చారు. వైఎస్సార్ సీపీలోకి చేరిన వారిలో రమావత్ సేవా నాయక్, భగవాన్ నాయక్, శంకర్ నాయక్, లక్ష్మణ్‌నాయక్, రవినాయక్, కోటయ్యనాయక్, రంగానాయక్, పంతునాయక్, చిన్ని నాయక్, హనుమానాయక్, మోతీలాల్ నాయక్, జబ్బార్ నాయక్, బాణావత్ రంగానాయక్, దాడి మోతీలాల్ నాయక్, స్వామి నాయక్‌తో పాటు పలు కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ ఏసూరి సాయి శంకర్, నెహ్రూనగర్ తండా సర్పంచ్ సుబ్రహ్మణ్యం నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు తోటకూర నాగేశ్వరరావు, పసుపులేటి వెంకటరామయ్య, కొల్లి హనుమయ్య, కె. రవి, భాస్కర్ నాయక్, గోవిందు నాయక్, రామాంజి నాయక్ పాల్గొన్నారు.

పల్నాడులో భారీ వర్షం

- పొంగిన వాగులు... నిలిచిన రాకపోకలు
- ముంపునకు గురైన పంట పొలాలు



దుర్గిలో ప్రవహిస్తున్న ముటుకూరు వాగు



పాత పాలువాయి, కొత్త పాలువాయి గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న పిల్లి వాగు

రెంటచింతల: పల్నాడులో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అగ్నిగుండాన్ని తలపించే రెంటచింతలలో శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు భారీ వర్షం కురిసింది. 135.6 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు తెలిపారు. మూడు నెలలుగా తీవ్ర వర్షాభావంతో అల్లాడిన రైతులు ఒక్కసారిగా వర్షం కురవడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు గంటల పాటు కురిసిన వర్షానికి రెంటచింతల, రెంటాల, మిట్టగుడిపాడు గ్రామాల్లో గోలి, ఏడుమంగళం వాగులు, పాలువాయి, పశర్లపాడు గ్రామాల్లో పిల్లి వాగు పొంగి పొర్లాయి. ఆయా గ్రామాల్లో కొంతమేర పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. గోలి వాగు వద్ద ఎస్ఐ జె. సామెల్ రాజీవ్ కుమార్ సిబ్బందితో జాగ్రత్త చర్యలు చేపట్టారు. వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో కొన్ని గంటలపాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రెంటచింతలలోని శివాలయం సమీపంలో రహదారులపై, పశువైద్యశాల వద్ద, స్థానిక రేగుల మాణ్యం కాలనీలలో భారీగా వర్షపునీరు చేరడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక ఆరోగ్యపురం, వెంకటేశ్వరస్వామి మాణ్యం కాలనీ మధ్య కల్వర్టుకు చెట్ల కొమ్మలు, చెత్త అడ్డుపడంలో కొన్ని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది.

గురజాలలో..

మండలంలో శనివారం రాత్రి అర్ధరాత్రి గంటకు పైగా కురిసిన వర్షం పత్తి, మిరప పంటలకు జీవం పోసింది. గత కొద్ది రోజులుగా భానుడు ప్రతాపాన్ని చూపుతున్నాడు. పంటలు వేసి వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఆశలు సన్నగిల్లాయి. ఈ సమయంలో రాత్రి కురిసిన వర్షం కొంతమేరకు ఉపశమనం లభించిందనే చెప్పవచ్చు. రహదారులు జలమయమయ్యాయి. మండలంలో 77 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైనట్లు ఆ శాఖ అధికారులు వెల్లడించారు.

దుర్గిలో...

మండలంలో శనివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి పలు వాగులు, చెరువులు నిండి కళకళలాడుతున్నాయి. వైఎస్సార్ వర్ధంతి రోజు వర్షం కురవడంతో ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. మిరప నారు, వివిధ పంటలు సాగు చేసి విత్తనాలు వేయడానికి సిద్ధమయ్యారు. ఆత్మకూరు చెరువుతో పాటు పలు గ్రామాల్లోని చెరువులు నీటితో నిండిపోయాయి. వర్షం కురవడంతో భూగర్భ జలాలు పెరిగి, నీటి సమస్య తీరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విత్తనాల దుకాణాల వద్ద, నర్సరీల వద్ద రైతుల సందడి నెలకొంది. ముటుకూరు వాగు పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



రెంటచింతల సమీపంలో ప్రవహిస్తున్న గోలి వాగు

ఫౌండేషన్‌కు మైక్‌సెట్ బహూకరణ

రెంటచింతల: మండలంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్‌కు వీఆర్వో పాశం నాసర్‌రెడ్డి రూ. 11 వేల విలువైన మైక్‌సెట్‌ను అందజేశారు. మీ సేవా కేంద్రం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మైక్‌సెట్‌ను ఫౌండేషన్ అధ్యక్షుడు పేరం చెన్నారెడ్డికి అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ నాయకులు సాంబశివారెడ్డి, నవులూరి చెన్నారెడ్డి పాల్గొన్నారు.

లయన్స్ పురస్కారాలకు ఐదుగురు ఉపాధ్యాయుల ఎంపిక

సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల ఆవరణలో గురు సత్కారోత్సవం పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేయనున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వరరావు తెలిపారు. నందిగామ జెడ్పీ హైస్కూలు అసిస్టెంట్ (మ్యాథ్స్) ఓరుగంటి శ్రీకాంత్, కంకణాలపల్లి ఎంపీపీ పాఠశాల ఎస్టీటీ వి.వి. గోపాలకృష్ణమూర్తి, నందిగామ జెడ్పీ హైస్కూలు పీఈటీ లాకు పిచ్చయ్య, సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం. ప్రసన్నరాణి, సత్తెనపల్లి శ్రీ బాబా గురుదేవ్ కళాశాల అధ్యాపకురాలు అబ్బూరి మంజరీదేవికి పురస్కారాల్ని అందజేయనున్నట్లు చెప్పారు.